# అధ్యాయము 5

# ఐగుప్తులో వైఫల్యము

ఇశ్రాయేలీయులను విడిపించుటకుగాను మోషే చేసిన మొదటి ప్రయత్నము 5 మరియు 6 అధ్యాయములలో నమోదు చేయబడింది. ఈ తన ప్రయత్నము వైఫల్యమును చవిచూడవలసి రావడం కొంతమేర ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు. దేవుని అరణ్యములో ఆరాధించులాగున (5:1) ప్రజలు వెళ్ళుటకు అనుమతిని కోరుతూ మోషే అహరోనును ఫరో ముందు ప్రత్యక్షమయ్యారు. ఫరో నిరాకరించాడు, దేవునినుండి వచ్చిన సందేశాన్ని ప్రక్కన పెట్టాడు, మరియు ఇశ్రాయేలీయుల యొక్క బరువు మరింత ఎక్కువగా చేయబడాలి అని కూడా ఆజ్ఞాపించాడు (5:2-9). ప్రజలు చూచిన ఫలితము ఏమనగా మరింత భారమైన పని మరియు అధికమైన వేదన (5:10-14). ఇశ్రాయేలీయులు ఫరోకు ఫిర్యాదు చేసినప్పుడు, వారి బరువును తేలికపరచడానికి ఆయన ఒప్పుకోలేదు (5:15-19). ఫలితంగా, వారు మోషే అహరోనులకు ఫిర్యాదు చేశారు (5:20, 21), మరియు మోషే తిరిగి దేవునికి ఫిర్యాదు చేసాడు (5:22, 23).

## మోషే యొక్క విన్నపము మరియు ఫరో యొక్క ప్రతికూల స్పందన (5:1-4)

**1తరువాత మోషే అహరోనులు వచ్చి ఫరోను చూచి - ఇశ్రాయేలీయుల దేవుడైన
యెహోవా - అరణ్యములో నాకు ఉత్సవము చేయుటకు నా జనమును పోనిమ్మని
ఆజ్ఞాపించుచున్నాడనిరి. 2ఫరో - నేను అతని మాట విని ఇశ్రాయేలీయులను
పోనిచ్చుటకు యెహోవా ఎవడు? నేను యెహోవాను ఎరుగను, ఇశ్రాయేలీయులను
పోనీయననెను. 3అప్పుడు వారు - హెబ్రీయుల దేవుడు మమ్మును ఎదుర్కొనెను,
సెలవైనయెడల మేము అరణ్యములోనికి మూడు దినముల ప్రయాణమంత
దూరముపోయి మా దేవుడైన యెహోవాకు బలి అర్పించుదుము; లేనియెడల ఆయన
మామీద తెగులుతోనైనను ఖడ్గముతోనైనను పడునేమో అనిరి. 4అందుకు ఐగుప్తు రాజు
- మోషే అహరోనూ, ఈ జనులు తమ పనులను చేయకుండా మీరెలా ఆపుచున్నారు?
మీ బరువులు మోయుటకు పొండనెను.**

**వచనము 1.** మోషే అహరోనులు ప్రజలతో కలిసిన తరువాత, వారు ఫరోను చూచుటకు వెళ్లారు. ఈ విధంగా ఫరోతో ముఖాముఖి సమావేశం ఎలా

ఏర్పరచుకున్నారు? మోషే ఇంతకుముందు ఐగుప్తు దేశములో కలిగియున్న ఆ పలుకుబడి ఫరోను నేరుగా కలుచుటకు ఉపకరించిందా? లేదా, ఆయన ఐగుప్తు దేశమును విడిచి వెళ్లిన నలుబది సంవత్సర కాలములో ఆ రాజ దర్బారుచే మరచిపోబడ్డాడా? ఆయన మరియు అహరోను అనువారలు రాజు సముఖములో ఐగుప్తీయులకు ప్రాముఖ్యమైన మరియు ఒక మాదిరిపాటి పరిమాణములో ఉన్న బానిస ప్రజలను గూర్చి ప్రస్తావించడం తగిన విషయమేనా?

మోషే మరియు అహరోనులు ఫరోతో మాట్లాడుతూ ప్రవక్తలు ప్రయోగించే పీఠికను ప్రస్తావించారు: **యెహోవా ఆజ్ఞాపించుచున్నాడు.** ఆ తరువాత వారు తమ దేవుని గౌరవార్థమై తమ **ప్రజలు ఒక ఉత్సవము** జరుపుకొనులాగున **అరణ్యములోనికి** వెళ్లుటకు అనుమతిని కోరారు. వారి కొరకు పనిచేస్తున్న ఇతర ప్రజల నుండి కూడా ఐగుప్తీయులు ఇటువంటి విన్నపములనే మునుపు విని ఉంటారు. “ఉత్సవమును జరుపుకొనుటకు” חגג (*chagag*) అనే మాట క్రియారూపము నుండి అనువదించబడింది మరియు ఈ పదము ఒక యాత్రిక ఉత్సవమును సూచిస్తుంది. ఈ పదము నిర్గమకాండము తరువాతి భాగములో ఇశ్రాయేలీయుల యొక్క సంవత్సరిక వేడుకల నేపథ్యంలో ప్రయోగించబడింది: పస్కా పండుగ, పులియని రొట్టెల పండుగ, కోతకాలముల పండుగ, పర్ణశాలల పండుగ (12:14; 23:14-16).

**వచనము 2.** ఫరో సారాంశముగా **నేను అతని మాట విని ఇశ్రాయేలీయులను పోనిచ్చుటకు యెహోవా ఎవడు? నేను యెహోవాను ఎరుగను, ఇశ్రాయేలీయులను పోనీయనని** చెప్పి వారి విన్నపమును త్రోసిపుచ్చాడు. ఫరో తన హృదయ కాఠిన్యమును ఆది నుండే బయలుపరుస్తున్నాడు. సుస్పష్టంగా, ఆయనకు దేవునితో ఎటువంటి పూర్వ అనుభవము లేదు మరియు బాధింపబడుతున్న వారియొక్క దేవుని గూర్చిన గౌరవము కొంతయైనను లేదు. తనంతట తానే దేవునిగా పరిగణించుకున్న ఫరోకు దేవును కోరుతున్నది కొంచెం వింతగా అనిపించింది.

నిర్గమకాండపు కథనమును అర్థం చేసుకొనుటకు ఈ వచనము ఒక మూల వచనముగా కనబడుతుంది: దేవుడు ఐగుప్తీయులతో మాట్లాడుట యొక్క ఉద్దేశము అసలు ఈ దేవుడు ఎవరు అనే విషయాన్ని ఫరోకు బోధించుటకు మరియు మానవులందరూ - అంటే ఐగుప్తు రాజుతో సహా - ఆ దేవునికి విధేయులై ఉండాలి అనే విషయాన్ని తన మదిలో ముద్రించుటకు కూడా అయి ఉంది. దీని తరువాత సంభవిస్తున్న సంఘటనల ఆధారంగా ఈ దేవుని గూర్చి ఫరో ఇంకా ఎక్కువగా తెలుసుకోవడం ప్రారంభిస్తాడు.

**వచనము 3.** మోషే మరియు అహరోనులు మరొకసారి ఫరోకు విన్నవించుకున్నారు, ఈ యాత్ర అనునది తమ **దేవుని**చే (3:18 చూడండి) ఆజ్ఞాపించబడింది అనే విషయాన్ని ఉద్ఘాటించారు. ఈ ఉత్సవము **మూడు దినముల ప్రయాణమంత** దూరములో ఉన్నది, అలాగే **బలులను** కూడా ఈ ఉత్సవము కోరుతుంది. ఇంతటి దూరము ప్రయాణించుటకు గల ముఖ్యమైన కారణము ఏమనగా ఇశ్రాయేలీయులు అర్పించే బలులు హేయమైనవిగా ఐగుప్తీయులు భావించేవారు (8:26పై గల వ్యాఖ్యలను చూడండి). దేవుని ప్రజలు వెళ్లుటకు అనుమతించుటలో

ఒకవేళ ఫరో విఫలమైతే వారు తీవ్రమైన పర్యావసానములు ఎదుర్కొంటారు అని మోషే మరియు అహరోనులు ఫరోకు హెచ్చరించారు.

**వచనము 4.** అనుమతిని అడుగుటకు మోషే మరియు అహరోనులు మరింత ఒత్తిడి తెచ్చినప్పుడు, వారు **జనులు తమ పనులు చేయకుండా ఆపుచున్నారు** అని వారిని నిందించాడు. అప్పుడు, అసూయ పంతములతో, ఆ ప్రజలు మరింతగా కష్టపడునట్లు చేసాడు (5:5-14). ఆయన స్పందిస్తూ, ఒక విధంగా, "ఈ విధంగా నన్ను అనుమతి అడుగుటకు మీకెంత ధైర్యం? మీరు మీ పనిధ్యాస నుండి కొంత కూడా మళ్ళకుండా మిమ్మల్ని ఎలా ఉంచాలో మీకు చూపిస్తా ఉండండి!" అని అంటున్నాడు. మునుపటి రాజు కంటే ఈ రాజుకు ఇశ్రాయేలు మీద ఎటువంటి దయ కూడా లేదు.

## విన్నపము యొక్క పర్యవసానములు: గడ్డిని సమకూర్చుకొనుట (5:5-14)

### ఫరో యొక్క కఠినమైన ఆజ్ఞలు (5:5-9)

**[5]మరియు ఫరో - ఇదిగో ఈ జనము ఇప్పుడు విస్తరించియున్నది; వారు తమ బరువులను విడిచి తీరికగా నుండునట్లు మీరు చేయుచున్నారని వారితో అనెను. [6]ఆ దినమున ఫరో ప్రజలపైనున్న కార్యనియామకులకును వారి నాయకులకును ఇట్లు ఆజ్ఞాపించెను [7]- ఇటుకలు చేయుటకు మీరు ఇకమీదట ఈ జనులకు గడ్డి ఇయ్యకూడదు, వారు వెళ్లి తామే గడ్డి కూర్చుకొనవలెను. [8]అయినను వారు ఇదివరకు చేసిన యిటుకలలెక్కనే వారి మీద మోపవలెను, దానిలో ఏమాత్రమును తక్కువ చేయవద్దు; వారు సోమరులు గనుక - మేము వెళ్లి మా దేవునికి బలి నర్పించుటకు సెలవిమ్మని మొఱ పెట్టుచున్నారు. [9]ఆ మనుష్యులచేత ఎక్కువ పని చేయింపవలెను, దానిలో వారు కష్టపడవలెను, అబద్ధపు మాటలను వారు లక్ష్యపెట్టకూడదనెను.**

**వచనము 5.** మరొకసారి రాజు **ఇదిగో ఈ జనము** [ఇశ్రాయేలీయులు] **ఇప్పుడు విస్తరించియున్నది; వారు తమ బరువులను విడిచి తీరికగా నుండునట్లు మీరు చేయుచున్నారు** అని బదులిస్తున్నాడు. ఈ వాక్యములోని మొదటి భాగము NRSV అనువాదములో ఈ విధంగా అనువదించబడింది: "ఇప్పుడు వారు [ఇశ్రాయేలీయులు] ఈ దేశ ప్రజల [ఐగుప్తీయుల] కంటే మిక్కిలి ఎక్కువగా ఉన్నారు."[1] "దేశము యొక్క ప్రజలు" (עַם הָאָרֶץ, *'am ha'arets*) అనే మాటను విశదపరచుటలోనే తేడా ఉంటుంది. ఒకవేళ ఈ మాట "ఐగుప్తీయుల"ను సూచిస్తున్నట్లయితే, ఇది ఒక హేతుబద్ధమైన వాదమే, అప్పుడు సమరయుల పంచగ్రంథ అనువాదమును అనుసరించి చేయబడిన NRSV అనువాదము సాధ్యపడుతుంది. కాగా, "ఈ దేశ ప్రజలు" అనే మాట "సామంతులు" ఇంకా చెప్పాలంటే హెబ్రీ వాక్యము సూచిస్తునట్లుగా ఇశ్రాయేలీయులను సూచిస్తుంది, ఈ అనువాదమునే NASB మరియు అనేక ఇతర ప్రముఖ అనువాదాలు

కూడా అనుసరిస్తున్నాయి.[2]

**వచనము 6.** మోషే మరియు అహరోనులు చేసిన విన్నపమునకు బదులుగా, రాజు **ప్రజలపైనున్న కార్యనియామకులను వారి నాయకులను** ప్రోగు చేసాడు. "ప్రజలపైనున్న కార్యనియామకులు" ఎవరంటే ఇటుకలు తయారుచేయుటకు అధికారులుగా ఉన్న ఐగుప్తీయులు మరియు "వారి నాయకులు" ఎవరనగా పని చేస్తున్న కొన్ని బృందాలపై వీరు ఏర్పరచిన ఇశ్రాయేలీ నాయకులు. "నాయకులు" అనే మాటకు హెబ్రీ పదము, שֹׁטֵר (*shoter*) నుండి వస్తుంది, మరియు దీని అక్షర అర్థము "శాస్త్రులు" అని. వారు చేయవలసిన పనిలో భాగము ఏమంటే ప్రతి దినము ఉత్పత్తి చేయబడిన ఇటుకల యొక్క సంఖ్యను వ్రాసుకోవడం.[3]

**వచనము 7.** అప్పటి నుండి, ఇటుకలను తయారుచేయుటకు గాను ఇశ్రాయేలీయులు **తామే వెళ్లి గడ్డిని కూర్చుకొనవలెను** అని ఫరో ఈ మనుష్యులతో చెప్పాడు. నిజానికి, ఇది సమయముతో కూడిన మరియు చాలా శ్రమతో కూడిన ఒక భారమైన ప్రక్రియే.

ఒక రాజకుటుంబ సలహాదారుడైన Rekhmire అనే ఒక వ్యక్తి సమాధి నుండి కనుగొనబడిన ఒక చిత్రలేఖనము (c. క్రీ.పూ. 1470-1445), ఈ ఇటుకల తయారీ పద్ధతిని ఉదాహరిస్తుంది.[4] ఒక సరస్సు నుండి నీరు మోయబడేవి ఆ నీరు గడ్డితో కలుపుబడిన అడుసుతో కలుపుబడేవి. అక్కడ నుండి, ఆ అడుసును వేరొక చోటుకి తీసుకొని వెళ్లే వారు అక్కడ ఇటుకల తయారీదారుడు పనిచేసేవాడు. ఒక ఇటుక ఆకారంలో ఉన్న చెక్కలో అడుసు వేసి నొక్కేవారు. ఆ విధంగా గట్టిబడిన తరువాత ఆ చెక్కను తీసేసి, ఏర్పడిన ఆ ఇటుక ఎండకు ఎండునట్లు ఉంచేవారు. ఈ విధంగా ఇటుకల వరుసలు వేసి అవి బాగా ఎండిన తరువాత ఉపయోగించు నిమిత్తము వాటిని బట్టీలలో పెట్టేవారు. అసలు గడ్డిని ఈ ఇటుకల తయారీలో ఎందుకు వాడాలో Alfred J. Hoerth అనే వ్యక్తి వివరించాడు: "అడుసులో ఉన్న దుమ్ము బాగా వదులుగా ఉన్నప్పుడు గడ్డి వాటిని బిగించే సాధనముగా ఉపయోగపడుతుంది. దీని విరుద్ధంగా కూడా, కొన్నిసార్లు అడుసులో దుమ్ము ఎక్కువగా ఉన్నప్పుడు కూడా గడ్డిని కలిపేవారు, ఇలా చేయుట ద్వారా ఇటుకలు ఎండునప్పుడు పగలకుండా బీటలువారకుండా ఉండేవి."[5]

అసలు గడ్డిలేని ఇటుకలతో చేయబడిన కొన్ని నిర్మాణములు, కనీసం సగభాగమైనా ఈ విధంగా చేయబడిన నిర్మాణముల యొక్క శిధిలాలు ఐగుప్తు దేశములో కనుగొనబడ్డాయి. గడ్డితో చేయబడని ఇటుకలు నిర్గమకాండము యొక్క కథనమునకు ఆధారముగా కూడా ప్రయోగిస్తారు.[6] కాని, ఇశ్రాయేలీయులు గడ్డితో లేదా గడ్డిలేకుండా ఇటుకలు చేశారు అని మాత్రము నిర్గమకాండము యొక్క కథనము మనకు అంత స్పష్టముగా చెప్పడం లేదనే విషయాన్ని మనం గమనించాలి.

**వచనము 8.** ఇంకా, **ఇదివరకు చేసిన ఇటుకల లెక్కనే** ఫరో ప్రజల నుండి ఆశించాడు. గడ్డిని వెదుకుటలో వెచ్చించే సమయము ఇటుకల తయారీలో వెచ్చించకూడదు, కాని ఇశ్రాయేలీ పనివారు ఇదివరకు చేసిన ఇటుకల లెక్కనే చేయవలసి ఉన్నారు. ఇశ్రాయేలీయులు చేసిన విన్నపాన్ని ఫరో **సోమరులుగా** ఆరోపించాడు. ఆయన మోషే మరియు అహరోనులను అనుకరిస్తూ, "**మేము వెళ్లి మా**

**దేవునికి బలి నర్పించుటకు సెలవిమ్మని మొఱ పెట్టుచున్నారు**" అని అంటున్నాడు (5:3 చూడండి).

**వచనము 9. ఆ మనుష్యులచేత ఎక్కువ పని చేయింపవలెను, దానిలో వారు కష్టపడవలెను, అబద్ధపు మాటలను వారు లక్ష్యపెట్టకూడదు** అని చెప్తూ ఫరో తన ఆజ్ఞలను ముగించాడు. ఒకవేళ ఇశ్రాయేలీయులు కార్యనిమగ్నులుగా ఉన్నట్లయితే, అప్పుడు తమ దేవునికి ఒక ఉత్సవమును చేయాలనే విషయమును ఆలోచించుటకు వారికి సమయము ఉండదు. ఇంకా, మోషే మరియు అహరోనులు వారికి చేస్తున్న బోధలను ప్రజలు ఎంతమాత్రము వినరు. ఈ ఇద్దరు మనుష్యులు మునుపు దేవుని నుండి స్వీకరించిన సందేశమును ఫరో "అబద్ధపు మాటలు" లేదా "అబద్ధాలు"గా (NIV) పరిగణించాడు.

## ఆజ్ఞను పాటించుటలో ఇశ్రాయేలు యొక్క అసమర్థత (5:10-14)

**[10]కాబట్టి ప్రజలు కార్యనియామకులును వారి నాయకులును పోయి ప్రజలను చూచి - నేను మీకు గడ్డి ఇయ్యను; [11]మీరు వెళ్లి మీకుగడ్డి ఎక్కడ దొరుకునో అక్కడ మీరే సంపాదించుకొనుడి, అయితే మీ పనిలో నేమాత్రమును తక్కువ చేయబడదని ఫరో సెలవిచ్చెననిరి. [12]అప్పుడు ప్రజలుగడ్డికి మారుగా కొయ్యి కాలు కూర్చుటకు ఐగుప్తుదేశమందంతటను చెదిరి పోయిరి. [13]మరియు కార్యనియామకులు వారిని త్వరపెట్టి గడ్డి ఉన్నప్పటివలెనే యేనాటిపని ఆనాడే ముగించుడనిరి. [14]ఫరో కార్యనియామకులు తాము ఇశ్రాయేలీయులలో వారి మీద ఉంచిన నాయకులను కొట్టి - ఎప్పటివలె మీ లెక్క చొప్పున ఇటుకలను నిన్న నేడు మీరు ఎలా చేయించలేదని అడుగగా.**

**వచనములు 10, 11. కార్యనియామకులు** మరియు **నాయకులు** ఇశ్రాయేలీయులకు ఈ సమాచారమును ఇచ్చిరి: అదే పరిమాణములో **పని** చేసి ఇటుకలు చేయుటకు కావలసిన **గడ్డిని** కూడా వారే సమకూర్చుకోవాలి. మోషే మరియు అహరోను దేవుని సందేశమును పరిచయం చేసిన విధముగానే వారు కూడా **ఫరో సెలవిచ్చెను** అని చెప్పుట అనుకోకుండా జరిగిన కార్యం కాకపోవచ్చు (5:1 చూడండి). దీని ద్వారా ఫరో మాట యెహోవా మాటతో సమానము - లేక అంతకంటే బలమైనది - అని చెప్పాలని వారు అనుకున్నారు.

**వచనము 12.** దీనికి పరిణామంగా **ప్రజలుగడ్డికి మారుగా కొయ్యి కాలు కూర్చుటకు ఐగుప్తుదేశమందంతటను చెదిరి పోయిరి.** "ఐగుప్తుదేశమంతటను" అను మాట ఇటుకలు చేయుటకు కావలసిన గడ్డిని వెదకుటలో ఉపయోగించవలసిన సమయమును వేర్వేరు ప్రాంతములకు వెళ్లవలసిన ఆలోచనను తెలుపుటకు ఉపయోగించిన అతిశయోక్తి కావచ్చు. (ఇదే విధమైన అతిశయోక్తి ఉపయోగం కొరకు, 1:9 చూడండి.)

**వచనములు 13, 14.** ఊహించిన విధంగానే, వారు చేయవలసిన పరిమాణంలో ఇటుకలను చేయుటలో ఇశ్రాయేలీయులు విఫలమైయ్యారు, మరియు ఇందు వలన

ఇశ్రాయేలు నాయకులు కొట్టబడ్డారు.

## నాయకులు ఫరోకు ఫిర్యాదు చేయుట (5:15-19)

**[15]ఇశ్రాయేలీయుల నాయకులు ఫరోయొద్దకు వచ్చి - తమ దాసుల యెడల తమ రెందుకిట్లు జరిగించుచున్నారు? [16]తమ దాసులకు గడ్డినియ్యరు అయితే ఇటుకలు చేయుడని మాతోచెప్పుచున్నారు; చిత్తగించుము, వారు తమరి దాసులను కొట్టుచున్నారు, అయితే తప్పిదము తమరి ప్రజలయందే యున్నదని మొఱపెట్టిరి. [17]అందుకతడు - మీరు సోమరులు మీరు సోమరులు అందుచేత - మేము వెళ్లి యెహోవాకు బలినర్పించుటకు సెలవిమ్మని మీరడుగుచున్నారు. [18]మీరు పొండి, పనిచేయుడి, గడ్డి మీకియ్యబడదు, అయితే ఇటుకల లెక్కమీరప్పగింపక తప్పదని చెప్పెను. [19]- మీఇటుకల లెక్కలో నేమాత్రమును తక్కువ చేయవద్దు, ఏనాటి పని ఆనాడే చేయవలెనని రాజు సెలవియ్యగా, ఇశ్రాయేలీయుల నాయకులు తాము దురవస్థలో పడియున్నట్లు తెలిసికొనిరి.**

**వచనము 15.** ఇశ్రాయేలు **నాయకులు** తరువాత **ఫరో**కు ఫిర్యాదు చేశారు. నాయకులకు ఫరో యొద్దకు వెళ్లుటకు అనుమతి ఉండుట ఆసక్తికరమైన విషయం. ఈ ఐగుప్తు రాజుకు వ్యక్తిగత ప్రభుత్వ నిర్వాహణ శైలి ఉందని, రాజ్యము యొక్క అనుదిన చర్యలలో తాను పాలుపంచుకొనేవాడని, లేక కనీసం నిర్మాణ పనులలో పాలుపంచుకొనేవాడని ఈ లేఖనము సూచిస్తుంది.

**వచనము 16.** అట్టి చెడు ప్రవర్తనకు పాత్రులగుటకు మునుపు వారు ఎలాంటి తప్పిదము చేయలేదని నాయకులు మర్యాదగా మాట్లాడిరి, మరియు వారు తిన్న దెబ్బలకు ఐగుప్తీయులదే తప్పిదము అని వారు ఆరోపణ చేసిరి. వారి సొంత గడ్డిని సమకూర్చుకొని లెక్కకు అన్నే **ఇటుకలు** చేయుటకు బలవంతం చేయబడుట ద్వారా వారితో దుర్వ్యవహారం జరుగుతుందని వారు చెప్పిరి. ఈ నాయకులు, ఆజ్ఞను ఇచ్చిన ఫరో (మరియు అతని కార్యనిర్వాహకులు) మరియు అట్టి సాధ్యముకాని కార్యములను చేయుటలో విఫలమైన ఇశ్రాయేలీయుల మధ్య చిక్కుకుపోయిరి.

**వచనములు 17, 18. యెహోవాకు బలినర్పించుటకు** వెళ్లుదమని వారు చేసిన విన్నపమునకు వారి **సోమరితనము** కారణము అనే ఆరోపణను ఫరో మరొకసారి చేశాడు (5:8 చూడండి). తన మనస్సును తాను మార్చుకోనని అతడు చెప్పాడు; వారు అప్పటికీ వారి సొంత గడ్డిని సమకూర్చుకోవాలి మరియు అదే సంఖ్యలో ఇటుకలను తయారుచేయాలి. ఫరో వారి మాటలనే వారికి విరోధంగా ఉపయోగించాడు: "మేము పోవుదము," అని వారు అన్నారు, "మీరు పొండి, పని చేయుడి" అని ఆయన స్పందించాడు. అతడు మరలా "గడ్డి ఇవ్వబడదు" అని చెప్పుట ద్వారా వారి గడ్డిని వారే సమకూర్చుకోవాలని ఆయన భావం.

**వచనము 19.** ఆ సమయంలో, ఫరో పోరాడే వైఖరిని బట్టి **ఇశ్రాయేలీయులు తాము** [నిజంగా] **దురవస్థలో పడియున్నట్లు తెలిసికొనిరి.** "దురవస్థ" (רַע, *ra'*) అనునది

“చెడు” అని కూడా అనువదించవచ్చు (KJV; ASV చూడండి). ఈ హెబ్రీ పదమునకు సంబంధించి, Umberto Cassuto ఈ విధంగా వ్రాసాడు,

> [ఇది] . . . ఐగుప్తీయుల యొక్క ప్రధాన దేవతయైన *Re'* ను సూచిస్తున్నట్లుగా ఉంది, కాని రెండు భావనలను వెంటవెంటనే చెప్తుంది: వారు తమను తాము *దుష్టమైన* [רָע, *ra'*] ఒక పన్నాగములో కనుగున్నారు ఎందుకంటే *Re'* అనే దేవుని ఆరాధాన చేసేవారి చేతిలోనికి వీరు అప్పగింపబడ్డారు గనుక.[7]

ఈ వాక్యభాగము యొక్క వర్ణణాత్మక శైలి గమనార్హం. ఇతర కథనముల వలె, ఇక్కడ, కథ పునరావృతం చేయబడింది. ఈ సందర్భంలో, కథనము నాలుగు మార్లు ఇవ్వబడింది, మరియు ఇంచుమించు అదే పదాలతో ఇవ్వబడింది. వచనములు 7 మరియు 8లో, ప్రజలకు గడ్డి ఇవ్వకూడదని ఫరో అక్కడ కార్యనియామకులతో చెప్పెను. వచనములు 10 మరియు 11లో, కార్యనియామకులు ఆ సందేశమును ఇశ్రాయేలీయులతో అదే పదాలలో చెప్పారు. తమ గడ్డిని తామే కూర్చుకొని ఇటుకలు చేయుటను గూర్చి ఇశ్రాయేలీయులు ఫరోకు ఫిర్యాదు చేయుటను గూర్చి వచనము 16లో చెప్పబడింది. ఫరో స్పందనగా, ఆజ్ఞను పునారావృతం చేయుటను గూర్చి వచనములు 18 మరియు 19లో ఇవ్వబడింది.

## నాయకులు మోషేతో ఫిర్యాదు చేయుట (5:20, 21)

**[20]వారు ఫరో యొద్ద నుండి బయలుదేరి వచ్చుచు, తమ్మును ఎదుర్కొనుటకు దారిలో నిలిచియున్న మోషే అహరోనులను కలిసికొని [21]యెహోవా మిమ్ము చూచి న్యాయము తీర్చును గాక; ఫరో యెదుటను అతని దాసుల యెదుటను మమ్మును అసహ్యులనుగా చేసి మమ్ము చంపుటకై వారి చేతికి ఖడ్గమిచ్చితిరని వారితో అనగా.**

**వచనము 20.** ఇశ్రాయేలీయుల నాయకులు సింహాసన గదిని విడచి, బహుశా సమావేశం ఎలా జరిగిందో అడిగి తెలిసికొనుటకు **నిలిచియున్న మోషే మరియు అహరోనులను కలిసికొనెను.** నాయకులు వారు వినిన దానిబట్టి బహుగా బాధపడ్డారు. వారు మోషే మరియు అహరోనులను కలిసికొన్నప్పుడు, నిస్సందేహంగా ఈ ఇద్దరు వారిని “విడిపించుటకు” మునుపటి దినాలను జ్ఞాపకం చేసుకొన్నారు. వారు ప్రస్తుతం అనుభవించుచున్న బాధలకంటే పురాతన రోజులే ఒక తీపి కలగా అనిపించాయి.

**వచనము 21.** నాయకులు మోషే మరియు అహరోనులకు ఫిర్యాదు చేసిరి; వారు అనుభవించుచున్న బాధను బట్టి వారిని నిందించారు. వారు ఈ విధంగా చెప్తున్నారు, “ఫరో యెదుటను అతని దాసుల యెదుటను మమ్మును అసహ్యులనుగా చేసి మమ్ము చంపుటకై వారి చేతికి ఖడ్గమిచ్చితిరి.” **మమ్ము చంపుటకై . . . ఖడ్గమిచ్చితిరి** అని వారు పలికినప్పుడు, బానిసల వలె అవమానించబడుతున్నాము, కొట్టబడుతున్నాము లేదా మరణించేంతగా పని చేస్తున్నాము అని వారు ఆలోచించారు.[21] **యెహోవా మిమ్ము చూచి న్యాయము తీర్చును గాక** అని చెప్పడం “నీవు నన్ను తప్పుపట్టావు; దేవుడు నిన్ను

శిక్షించును గాక!" అని చెప్పుటకు సాహసం చేయలేని సమయంలో చెప్పే వాక్కు.

## దేవునికి మోషే ఫిర్యాదు (5:22, 23)

**[22]మోషే యెహోవా యొద్దకు తిరిగి వెళ్లి - ప్రభువా, నీవేల ఈ ప్రజలకు కీడు చేసితివి? నన్నేల పంపితివి? [23]నేను నీ పేరట మాటలాడుటకు ఫరో యొద్దకు వచ్చినప్పటినుండి అతడు ఈ జనులకు కీడే చేయుచున్నాడు, నీ జనులను నీవు విడిపింపను లేదనెను.**

**వచనములు 22, 23.** నాయకులకు మోషే ఏమి సమాధానం చెప్పాడో వాక్యభాగంలో చెప్పబడలేదు. అయితే, అతడు వారిని అర్థం చేసుకొని మరియు వారి భావాలచే కదలింపబడి మరియు తనకు వ్యతిరేకంగా వారు చేసిన ఆరోపణవలన కలవరపడెను. వారి ఫిర్యాదు దేవుని యొద్దకు తీసుకువెళ్లాడు. సహజంగా, అతడు మానవునికి మరియు దేవునికి మధ్య మధ్యవర్తిగా ఉండి, ప్రజల యొద్దకు దేవుని మాటను మరియు దేవుని ధర్మశాస్త్రమును తెస్తున్నాడు; ఈ సందర్భంలో (మరియు ఇతర సందర్భాల్లో), అతడు మానవునికి మరియు దేవునికి మధ్య మధ్యవర్తిగా ఉండి, ఇశ్రాయేలీయుల బాధను దేవుని యొద్దకు తెస్తున్నాడు.

అతడు చేస్తానని చెప్పి, చేయకుండా ఉన్నవిధానాన్ని బట్టి ప్రజలు అతనిని నిందించినట్లుగానే, దేవుడు తాను వాగ్దానం చేసిన దానిని చేయట్లేదని మోషే దేవునిని నిందించాడు. మోషే ప్రభావంతో ఇలా చెప్పాడు, "ప్రజలను విమోచించడానికి నీవు నన్ను పిలచావు. నేను వచ్చి నీవు చెప్పినదానిని చేసాను, కానీ నీవు చేస్తానని చెప్పినది మాత్రం నీవు చేయలేదు; నీవు ప్రజలను విడిపించలేదు. వాస్తవంగా, మునుపటి కంటే వారి స్థితి అధ్వాన్నంగా మారింది! నీవు ఈ ప్రజలకు ఎందుకు హాని కలిగించావు?" దేవుని సేవకుడు దేవునితో ఇలా స్పష్టంగా మాట్లాడడం ప్రకల్పనం కానీ మోషే మాత్రం తరచు దేవునితో అలాటి పదాలతోనే మాట్లాడేవాడు. మోషే ఫిర్యాదు సంబంధించి, Terence E. Fretheim ఈ విధంగా వ్యాఖ్యానించాడు,

> [మోషే] అర్థం చేసుకొనని విషయం ఏమనగా ఈ సదరు ప్రభావము [అంటే దేవుడు ఇశ్రాయేలీయులను చూస్తున్న విధానం] అసలు ఎందుకు చోటుచేసుకోవాలి; ఈ సంఘటన విమోచనను కేవలము తడవు మాత్రమే చేసింది. తన కఠినమైన ప్రశ్నలను బట్టి దేవుడు మోషేను మందలించుటలేదు. వాటిని దేవుడు వాటి విలువను బట్టి అంగీకరించాడు: జీవితములోని క్లిష్టమైన ఘట్టాలలో వచ్చే ఫిర్యాదులు. దేవుడు తన ఉద్దేశ్యాలు సరైన దిశలోనే ఉన్నాయి అనే విషయముతో మోషేకు నిశ్చయతను కలుగజేశాడు . . . దేవుని ఆలోచన చాలా స్పష్టమైనదిగా ఉంది; ఇశ్రాయేలు విమోచించబడుతుంది. నిజానికి, ఫరో తనంతటతానే పంపుతాడు, అసలు బలమైన హస్తముతోవారిని తోలివేస్తాడు.[8]

మోషే అడిగినా కానీ సమాధానమివ్వని ప్రశ్నతో అధ్యాయము 5 ముగియబడింది; సందేహం చెప్పబడింది కానీ పరిష్కరింపబడలేదు. తరువాత అధ్యాయము వరకు దేవుని సమాధానమియ్యబడలేదు.

# అన్వయము

## "యెహోవా ఎవడు?" (5:2)

"యెహోవా ఎవడు" అని ఫరో ప్రశించాడు? మన దృష్టిలో, అతనిది దురహంకార ప్రశ్న. మానవుని పట్ల లేదా దేవుని పట్ల ప్రేమలేని మొండి పట్టుదలగల, కఠినముగల, క్రూరమైన పాలకుని చేత అడుగబడిన ప్రశ్న. ఫరో దృష్టిలో, అది సహేతుకమైన ప్రశ్న. ఇశ్రాయేలీయులు అణకువకలిగిన బానిసలు, కానీ వారి ప్రతినిధి మాత్రం ప్రపంచంలో గొప్ప రాజ్యము యొక్క రాజైన దేవుడగు ఫరో యొద్ద వ్యాజ్యమాడుతున్నారు. అతనికి ఎంత ధైర్యం! ఫరోకు తెలియని దేవునిని గూర్చి మోషే మాట్లాడుతున్నాడు కాబట్టి, "అలాటి వాటిని అడిగే ఆ దేవుడు ఎవరు?" అని అతడు అడుగుతున్నాడు. "యెహోవా ఎవడు?" అని అగ్రహపడినదానిని బట్టి మరియు మోషే విన్నపమును తిరస్కరించిన దానిని బట్టి ఆశ్చర్యపోనవసరం లేదు.

నిజంగా, యెహోవాను గూర్చి ఫరో బాగా తెలుసుకొన్నాడు, వాస్తవానికి, అతని మోకాళ్ల మీదపడి దేవుని దీవెనలను కోరుకొన్నాడు (12:32). ఇంకను, ఫరో ప్రశ్న అనుకూలమైన ప్రశ్న. తాను అద్భుతకార్యములు చేయుటకు గల కారణం ఆయనే యెహోవాయని ఇశ్రాయేలీయులు, ఐగుప్తీయులు మరియు ప్రజలందరూ తెలిసికొనుటకు అని ఆయనే తరచు నిర్గమకాండము పుస్తకంలో తెలియజేసాడు (6:7; 7:3-5; 8:10; 8:22). అయితే, ఆ ప్రశ్నకు నిర్గమకాండము ఎలా సమాధానమిస్తుందో చూడడం మంచిది. *యెహోవా ఎవడు?* ఒకే పాఠంలో దేవుని లక్షణాలన్నిటి గూర్చి చర్చించడం అసంభవం, కానీ నిర్గమకాండములో బోధించబడిన కొన్ని సత్యాలను మనం పరిశీలిద్దాం.

*యెహోవా అబ్రాహాము దేవుడు, ఇస్సాకు మరియు యాకోబుల దేవుడు* (3:6, 15; 6:2, 3; 32:13). నిర్గమకాండము ఆదికాండము యొక్క కొనసాగింపు; నిర్గమకాండములో దేవుడు చేసిన ప్రతిదీ దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానముల నెరవేర్పు. అబ్రాహాము వంశం ద్వార దేవుడు లోకములోకి రక్షకుడిని తీసుకువచ్చే ప్రణాళిక వేసాడు. ఇశ్రాయేలీయులను తన ప్రజలుగా చేసికొనుట ద్వార ఆ ప్రణాళిక నెరవేర్పును ప్రారంభించాడు. నిర్గమకాండములో అబ్రాహాము, ఇస్సాకు, యాకోబుల దేవుడే ఎన్నుకొనబడిన రాజ్యమునకు దేవుడుగా అయ్యాడు మరియు ఆయన ప్రజల యందు నివసించుటను ఆరంభించాడు (19:5, 6; 29: 45, 46).

*దేవుడు గొప్ప "ఉన్నవాడనువాడు"* (3:13, 14). "ఉన్నవాడు" (הָיָה, *hayah*) అని అనువదించబడిన హెబ్రీ పదము "ప్రభువు" లేదా "యెహోవా" (יהוה, *YHWH*) అని అనువదించబడిన దానితో సమానము. అంతర్భావం ఏంటంటే దేవుడు ఎల్లప్పుడు ఉన్నవాడు, అనువాడు, శాశ్వతంగా ఉంటాడు. దేవుడు కాల పరిధిలో నివసించువాడు కాడు, కానీ నిత్యత్వములో నివసించువాడు.

*యెహోవా పరిశుద్ధుడు* (లేవీయ. 11:45; యెష. 6:3). ఆయన పరిశుద్ధుడు గనుక, ఆయన మోషేకు ప్రత్యక్షపరచుకొన్న ప్రదేశము పరిశుద్ధము (3:5). ఆయన

ఆరాధింపబడు ప్రదేశము, ప్రత్యక్షగుడారము, పరిశుద్ధము (28:29, 35), మరియు ప్రత్యక్షగుడారముతో సంబంధం ఉన్న ప్రతిదీ - ప్రధాన యాజకుని అంగీలు - కూడా పరిశుద్ధమే (28:2, 29:29; 30:25-29). ఆయన ప్రజలు పరిశుద్ధులుగా చెప్పబడ్డారు (19:6). R. Alan Cole ఈ విధంగా చెప్పాడు, "ధర్మశాస్త్రం అనునది దేవుని పరిశుద్ధతకు శబ్ద వ్యక్తీకరణం, గుడారము అనేది కనిపించు వ్యక్తీకరణం, మరియు ఇశ్రాయేలు రాజ్యం నడకకు ఉదాహరణ."[9] దేవుని ప్రజలు పరిశుద్ధంగా ఉన్నారో (లేవీయ. 11:45), ఆయన ప్రజలు ఈ రోజు కూడా పరిశుద్ధంగా ఉండాలి (1 పేతురు 1:15, 16).

*దేవుడు శక్తివంతుడు ఆయనకు వ్యతిరేకంగా నిలబడిన దేనినైనా (లేదా ఎవరినైనా) ఓడించువాడు.* నిర్గమకాండము అనేది దేవునికి మరియు ఐగుప్తు దేవతలకు మధ్య సంఘర్షణ, మరియు ఆ దేవతలపై దేవుని విజయం - నిర్గమ. 14:30లో చెప్పబడి మరియు నిర్గమ. 15లో వేడుకగా జరుపుకున్న విజయం. మోషే కాలంలో పరలోకం క్రింద గొప్ప రాజ్యములోనున్న దేవతలకన్న దేవుడు ఉన్నతమైనవాడు మరియు ప్రపంచంలోనున్న ఇతర దేవతలకన్నా కూడా ఆయన గొప్పవాడుగానే ఉన్నాడు. Cole ఈ విధంగా వివరించాడు, "మానవ శక్తికి నిదర్శనంగా ఫరో నిలబడ్డాడు, దేవునికి మరియు ఆయన ప్రజలకు వ్యతిరేంగా ఆవేశపడ్డాడు: అందుచేత దేవునికి వ్యతిరేకంగా పోరాడడం మరియు ఆయన ప్రణాళికలను అడ్డుకోవడం అసంభవం అని అన్ని కాలముల వారికి తెలియజేయుటకు ఆయన నాశనం ఒక చిహ్నం."[10] దేవుడు, నిజానికి, రాజులకు రాజును ప్రభువులకు ప్రభువునై యున్నాడు (1 తిమోతి 6:15).

*దేవుడు కరుణామయుడు మరియు కృపామయుడు.* తాను "కనికరము, దయ, దీర్ఘశాంతము, విస్తారమైన కృపాసత్యములు గలవాడనని" ఆయనే తెలియపరచుకొన్నాడు (34:6). దేవుని కృపను మరియు ఆయన కనికరమునకు మరియు కృపకు రుజువును చూపిస్తూ నిర్గమకాండము ఒత్తి చెప్తుంది.

*దేవుడు నిస్సహాయుల రక్షకుడు.* బలహీనమైన మరియు రక్షించుకోలేని వారితో న్యాయంగా విచారించాలని ఇశ్రాయేలీయులకు దేవుడు చెప్పినప్పుడు, ఆయన ప్రత్యేకంగా ఆయన యొక్క లక్షణాలను మరియు ఆయన శ్రద్ధను వారికి ఉదాహరణగా ఇచ్చాడు (22:21-27; లేవీయ. 19:9-14 చూడండి).

*దేవుడు ఆజ్ఞాపించువాడు, విధేయతను ఆశించువాడు, మరియు పాపులను శిక్షించువాడు.* దేవుడు కరుణామయుడు మరియు కృపామయుడు, ఆయన కాఠిన్యము గలవాడు (రోమా. 11:22 చూడండి). ఆయన అజ్ఞాపించువాడు (అధ్యా. 20-24), విధేయతను కోరుకొనువాడు (19:5), మరియు అవిధేయులను శిక్షించువాడు (అధ్యా. 32; సంఖ్యా. 15:32-36 చూడండి). ఆయన కృపను మరియు దయను గూర్చి వివరించే వాక్యభాగాము కూడా "దోషులను నిర్దోషులనుగా ఎంచడు" (34:7).

*దేవుడు మనసును మార్చుకొనువాడు.* ఒక విధంగా, ఆయన మారనివాడు (హెబ్రీ. 13:8 చూడండి). అయితే, మరొక విధంగా, ఆయన తన మనసును మార్చుకొనువాడు (32:14 చూడండి). ఆయన వారి ప్రవర్తనకు అనుగుణంగా ఆయన ఇశ్రాయేలీయులతో మాట్లాడాడు. అదే విధంగా, మన పరిస్థితులు మారినప్పుడు మన పట్ల కూడా దేవుడు

మారతాడు. పాపులంగా మనం మరణించవలసినవారమై యున్నాము; కానీ క్రీస్తు వైపు తిరిగడం వలన మన స్థితిని మార్చుకొని రక్షించబడినప్పుడు, మన పట్ల ఆయన ప్రవర్తనను కూడా మార్చుకొన్నాడు. మరణము నుండి మనం తప్పించబడి మరియు దేవుని పిల్లలమయ్యాము (రోమా. 3:23, 24; 5:1; 6:17-23).

"దేవుడు ఎవరు?" అను ప్రశ్నకు నీవు ఏ విధంగా సమాధానమివ్వగలవు? మనం ఎలా జీవిస్తున్నామనేది దేవునిని మనం ఏవిధంగా అర్థం చేసుకొంటున్నామన్న దానిపై ఆధారపడి యుంటుంది. ప్రజలను తమ పాపములతో అంగీకరించడానికి దేవుడు పరిశుద్ధుడు. పాపములను శిక్షించడానికి ఆయన న్యాయవంతుడు, కానీ మనలను క్షమించడానికి ఆయన దయగలవాడు: మనం ఇది అర్థం చేసుకోవాలి: ఆయన నియమించిన షరతులను నిర్వర్తించిన వారికి మాత్రమే ఆయన దయ చూపిస్తాడు.

## నిర్గమము యొక్క దేవుడు (5:2)

నిర్గమకాండముపై తాను వ్రాసిన వ్యాఖ్యానంలో R. Alan Cole "నిర్గమకాండము యొక్క దైవశాస్త్రము" అనే ఒక గొప్ప భాగాన్ని పొందుపరచాడు. నిర్గమకాండము యొక్క దేవుని గూర్చి ఆయన వ్రాస్తూ ఇలా అంటాడు:

1. "చరిత్రను తన ఆధీనంలో ఉంచుకొనుచున్న దేవుడు"
2. "'నేనే యెహోవాను' [అని చెప్పే దేవుడు]"
3. "పరిశుద్ధుడైన దేవుడు"
4. "జ్ఞాపకము ఉంచుకొను దేవుడు"
5. "రక్షణలో కార్యము చేయు దేవుడు"
6. "తీర్పులో కార్యము చేయు దేవుడు"
7. "కోపమును దారి మళ్ళించుకొనగలిగిన దేవుడు"
8. "మాట్లాడే దేవుడు"
9. "సర్వోత్కృష్టమైన దేవుడు"
10. "తన ప్రజల మధ్యలో నివసించే దేవుడు."[11]

## నిరుత్సాహపడిన దూతలు (5:20-23)[12]

5వ అధ్యాయము ముగింపులో, మోషే (ఇశ్రాయేలు మిగతావారితో కూడా కలిసి) కొంత నిరుత్సాహపడిపోయాడు. ఈ విధంగా నిరుత్సాహపడిన దేవుని సేవకులలో ఈయన మాత్రమే లేడు; ఏలీయా (1 రాజులు 19:1-18) మరియు యిర్మీయా (యిర్మీ. 20:7-9) కూడా నిరుత్సాహపడినవారే. నిరుత్సాహపడడం అనేది తప్పేమీ కాదు. నిరుత్సాహపడినప్పుడు దేవుని యొక్క దాసుడు ఏమి చేయాలి? దేవుని వద్దకు వెళ్లాలి, మోషే వెళ్లినట్లుగా. తమ ఆందోళనలను మరియు చింతలను దేవుని వద్దకు తెచ్చేవారిని దేవుడు ఆదరించి ప్రోత్సహిస్తాడు (అపొస్తలుల కార్యములు 18:9; 1 కొరింథీ. 2:3 చూడండి).

## ప్రారంభ వైఫల్యం, తుదకు విజయం (5:20-23)

ప్రారంభములో కలిగే వైఫల్యములు తుదకు ఓటమి వద్దకే మనలను నడపవలసినంత అవసరత లేదు అని నిర్గమకాండము 5వ అధ్యాయములోని మోషే యొక్క అనుభవము మనకు తెలుపుతుంది. అధ్యాయము యొక్క ముగింపులో, మోషే సుస్పష్టంగా తన యుద్ధములో ఓడిపోయాడు; కాని క్రమక్రమేణా పరిస్థితులు మారాయి, మరియు మోషే ఉన్నట్లుండి విజయం వైపు నిలిచాడు! తుదకు జయమును పొందుటకు మునుపు అనేకమంది గొప్ప మహానుభావులు వైఫల్యాలను ఎదుర్కొన్నవారే. క్రైస్తవ ప్రయత్నములు చాలా మట్టుకు సూక్ష్మమైన ఆరంభములతోనే ప్రారంభమై క్రమంగా విజయాన్ని చవిచూచుటకు మునుపు అనేకమైన ప్రారంభ వైఫల్యాలను చూసాయి. ఈ కథనము యొక్క నీతి ఏమిటి? ప్రయత్నిస్తూనే ఉండాలి, మరియు జయించుటకు తుదకు దేవుడు మనకు సహాయము చేయగలడు అని జ్ఞాపకము ఉంచుకోవాలి.

---

సూచనలు

[1]REB అనే అనువాదము NRSV అనువాదముతో పోలి ఉంది: "మీ ప్రజలు ఇప్పటికే స్థానిక ఐగుప్తీయులను సంఖ్యలో మించియున్నారు." [2]John I. Durham, *Exodus*, Word Biblical Commentary, vol. 3 (Waco, Tex.: Word Books, 1987), 64-65. [3]George Rawlinson, "Exodus," in *The Pulpit Commentary*, vol. 1, *Genesis and Exodus*, ed. H. D. M. Spence and Joseph S. Exell (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1950), 124. [4]Alfred J. Hoerth, "Brick," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:546. [5]Ibid., 545. [6]Henry H. Halley, *Halley's Bible Handbook*, 24th ed., rev. (Grand Rapids, Mich.: Zondervan, 1965), 120. [7]Umberto Cassuto, *A Commentary on the Book of Exodus*, trans. Israel Abrahams (Jerusalem: The Magnes Press, 1997), 72. [8]Terence E. Fretheim, *Exodus*, Interpretation: A Bible Commentary for Teaching and Preaching (Louisville: John Knox Press, 1991), 88. [9]R. Alan Cole, *Exodus: An Introduction and Commentary*, Tyndale Old Testament Commentaries (Downers Grove, Ill.: Inter-Varsity Press, 1973), 23. [10]Ibid., 29.

[11]Ibid., 19-40. [12]Waldemar Janzen, *Exodus*, Believers Church Bible Commentary (Scottdale, Pa.: Herald Press, 2000), 92.